'నిథమ్'లో మహిళలకు ప్రత్యేక శిక్షణ

• చేపల ఆధారిత ఉత్పత్తులు, వ్యాపార నిర్వహణపై శిక్షణ • ముగిసిన మరో విడత మహిళల శిక్షణ కార్యక్రమం


మహిళలకు చేపల ఔట్‌లెట్ల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు


శిక్షణ పొందిన మహిళలతో చెఫ్, నిథమ్, సెర్ప్ అధికారులు

రాయదుర్గం: ఇందిరా మహిళా శక్తి ప్రోగ్రామ్ కార్యక్రమంలో భాగంగా మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్స్ నిర్వహణపై చేపల విలువ ఆధారిత ఉత్పత్తులు, వ్యాపార నిర్వహణపై మలి విడత శిక్షణ శనివారం ముగిసింది. సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ(సెర్ప్), పంచాయతీ రాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ, గచ్చిబౌలిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(నిథమ్) సంయుక్తంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిథమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వెంకటరమణ పర్యవేక్షణలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంకే గణేశ్, సెర్ప్ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ సతీష్, చెఫ్ తుల్జారామ్, నిథమ్ శిక్షణ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మిచెల జే ప్రాన్సిస్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం సాగింది. మహిళలకు రకరకాల చేపలతో ఫిష్ పకోడా, చేపల-65, కట్లెట్, రొయ్యల పలావ్, అపోలో చేపలు, వేడి వెల్లుల్లిలో చేపలు, చేప వేపుడు, చేప బిర్యానీ వంటి ఆహార పదార్థాల తయారీపై చెఫ్ తుల్జారామ్ ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అనంతరం మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్స్ నిర్వహణ, ఆహారపదార్థాల తయారీ, పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పడం, నిర్వహణ వంటి అంశాలపై వారికి అవగాహన కల్పించారు. ముగింపు సమావేశంలో సెర్ప్ సీఈఓ దివ్య మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా తమ సొంత కాళ్లపై నిలబడాలనే సంకల్పంతో ప్రభుత్వ చేపట్టే కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలువురు సెర్ప్, నిథమ్ అధికారులు, ఫ్యాకల్టీ ప్రతినిధులు, శిక్షణ పొందిన వారు పాల్గొన్నారు.


గచ్చిబౌలిలోని నిథమ్‌లో మహిళలు తయారు చేసిన ఆహార పదార్థాలు

సుంకర రామచంద్రరావుకు నివాళి

గచ్చిబౌలి: సీనియర్ జర్నలిస్ట్, అనువాద రచయిత డాక్టర్ సుంకర రామచంద్రరావుకు పలువురు ఘనంగా నివాళులర్పించారు. గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ సుంకర రామచంద్రరావు సంస్మరణ సభకు మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామచంద్రరావుతో కలిసి జర్నలిస్ట్‌గా, నక్సల్‌బరీ ఉద్యమంలో కలిసి పని చేశామన్నారు. తాను నమ్ముకున్న సిద్ధాంతంతో పని చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఏ విషయంలోనూ రాజీపడే వారు కాదని, ఘర్షణ పడి ఒప్పించేందుకు ప్రయత్నించే వారని గుర్తు చేసుకున్నారు. కమ్యూనిస్ట్, ప్రగతిశీల భావజాల వాతావరణాన్ని కాపాడిన వారిలో రాయంచంద్రరావు ఒకరన్నారు. రామచంద్ర రావు తనయుడు శివరాం, సీనియర్ జర్నలిస్టులు కె.శ్రీనివాస్, కట్టా శేఖర్‌రెడ్డి, సురేందర్, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అల్లం నారాయణ

నేడు గోపన్‌పల్లిలో చిత్తారమ్మ ఆలయ బోనాలు

రాయదుర్గం: శ్రావణమాసాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలోని చిత్తారమ్మ ఆలయ బోనాలను ఆదివారం నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ వి.గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ఆలయంలో ప్రత్యేకంగా చిత్తారమ్మ అమ్మ వారికి పూజలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు ఆలయం ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని, సాయంత్రం 4 గంటలకు తొట్టెల ఊరేగింపు నిర్వహిస్తామని ఆయన వివరించారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాటా 45, పచ్చిమిర్చి 60, బెండ 50, కాకర 50, దొండ 40, దోస 30, ఆలు 30, చామ 50, కీర 40, బీర 50, వంకాయ 40, గోకర 60, బీన్స్ 100, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 25, క్యారెట్ 60, చిక్కుడు 70, ఉల్లి 30(కేజీ), క్యాలీఫ్లవర్(1) 30, సొరకాయ(కేజీ) 20, అల్లం 90, వెల్లుల్లి 150.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మియాపూర్: గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ పర్వీద్ అహ్మద్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూ హాఫీజ్‌పేట వసంత సిటీ రోడ్డు సమీపంలో ఓ వ్యక్తి పడి ఉన్నాడని స్థానికులు మియాపూర్ పోలీసులకు శనివారం సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

పింగళి వెంకయ్యకు నివాళి


మాట్లాడుతున్న మిరియాల ప్రీతమ్

చందానగర్: జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య 149వ జయంతి వేడుకలను చందానగర్ డివిజన్ పరిధిలోని సరస్వతీ విద్యామందిర్ పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సేవకులు, మిరియాల రాఘవ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ మిరియాల ప్రీతమ్ ముఖ్య అతిథిగా హాజరై పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దేశభక్తిని, విద్యార్థి దశలో క్రమశిక్షణపై వివరించారు. పింగళి వెంకయ్య జీవిత విశేషాలను, దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో దుర్గా మహేశ్వర, పాఠశాల కార్యదర్శి రఘునందన్‌రెడ్డి, కోశాధికారి నాగభూషణరావు, సభ్యులు సుదీప్ రెడ్డి, హెచ్‌ఎం అరుణ, పరదేశి నాయుడు, సాయి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు పెద్దపీట


మియాపూర్‌లో కాలనీ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీకాంత్

మియాపూర్: మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. డివిజన్ పరిధిలోని అల్లూరి సీతారామరాజు నగర్, డీకేఎన్‌క్లేవ్, సాయినగర్, న్యూ-ప్రశాంత్ నగర్ కాలనీలో జీహెచ్‌ఎంసీ, పలు శాఖల అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. కాలనీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను కాలనీ వాసులకు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దోవా కాలనీలోని డ్రైనేజీని జలమండలి సీజీఎం నారాయణ, జీఎం శివకృష్ణ, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. సమస్యకు త్వరగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు,కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యం సాధించాలి

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పదిలో 550కు పైగా మార్కులు తెచ్చుకున్న వారికి రూ.5 వేలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు జీవితంలో తాము ఏది సాధించాలని అనుకుంటున్నారో అది లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగాలని తెలిపారు.

వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి

పటాన్‌చెరు టౌన్: గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీ కొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి గాయాలయ్యాయి, ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాకు చెందిన వీరేష్ (32) బతుకుదెరువు కోసం వచ్చి ఇస్నాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం తన మరదలు సోనీని తీసుకొని ఇస్నాపూర్ నుంచి మల్లికార్జున్‌నగర్‌కు బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో పటాన్‌చెరు వైపు నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలై వీరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సోనీకి స్వల్ప గాయాలైయ్యాయి.

మట్టి కుప్పలు తొలగించరేం..?


చందానగర్‌లో తాగునీటి పైప్‌లైన్ కోసం తవ్విన రోడ్డు పక్కనే మట్టి కుప్పలు

చందానగర్: హైదరాబాద్- ముంబై జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మియాపూర్ నుంచి చందానగర్ వరకు నాలాలు, మంచినీటి పైప్‌లైన్ పనులు చేపడుతున్నారు. అయితే పైప్‌లైన్ కోసం తవ్విన మట్టి, రోడ్డు పక్కనే వేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం పడితే చాలు సర్వీస్ రోడ్డంతా బురదగా మారుతోంది. ముఖ్యంగా చందానగర్‌లోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం, ప్రైవేట్ బ్యాంకుల ముందు మాత్రం నడవడానికి వీలు లేకుండా పోయింది. కార్యాలయంలోని వెళ్లడానికి ఉద్యోగుల అవస్థలు పడుతున్నారు. నెలల తరబడి రోడ్డుపై మట్టి ఉండటంతో వ్యాపారస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారుల కాంట్రాక్టర్ త్వరగా పైప్‌లైన్ పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.

ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ రాజీవ్ గృహకల్పలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను శనివారం నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పాల్గొని ప్రజలకు శానిటేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ చెత్తను స్వచ్ఛ ఆటోలకు అందజేయాలన్నారు. మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని, ఈ విషయంపై అధికారులు వెంటనే స్పందించాలని సూచించారు. ఏఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, ఏసీపీ వెంకటరమణ, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ తనూజ, కమ్యూనిటీ ఆర్గనైజర్ శ్రీకాంత్, ఎస్‌ఆర్‌పీ బాలరాజ్, సీనియర్ నాయకులు బద్దం కొండల్‌రెడ్డి, వార్డు మెంబర్ శ్రీకళా వెంకటేశ్వర్లు, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా ధర్నాకు తరలిన నేతలు


బీజేపీ మహాధర్నాకు తరలివెళ్తున్న శేరిలింగంపల్లి బీజేపీ నాయకులు

గచ్చిబౌలి: కామారెడ్డి డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ పార్టీ బీసీలపై చూపుతున్న కపట నాటకానికి నిరసనగా బీజేపీ ఓబీసీ మోర్చా చేపట్టిన మహాధర్నాకు బీజేపీ శేరిలింగంపల్లి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ నాయకత్వంలో బీజేపీ, వివిధ మోర్చాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పలు వాహనాల్లో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. కామారెడ్డి బీజీ డిక్లరేషన్ పేరుతో బీసీలకు కాంగ్రెస్ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. బీసీ సంక్షేమానికి 20వేల కోట్ల నిధులు, బీసీ యువతకు ఇప్పిస్తానన్న బీసీ రుణాలు, ముస్లింలకు రిజర్వేషన్లు అంటూ మాయమాటలు చెబుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రాధాకృష్ణయాదవ్, రమణయ్య, ఆంజనేయులు, నర్సింహాచారి, గణేశ్, జితేందర్, లక్ష్మణ్, పద్మ, వరలక్ష్మీ, శివాసింగ్ పాల్గొన్నారు.


డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



మియాపూర్: అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్ కాలనీ నుంచి శాంతినగర్ కాలనీకి వెళ్లే కాలనీ రోడ్డులో ఎస్టీపీ పైపులైన్ పనుల మరమ్మతులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్టీపీ పైప్‌లైన్ మరమ్మతుల్లో జాప్యం వహించకుండా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మళ్లీ సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మ్యాన్‌హోల్‌లో చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి మురుగు నీరు సాఫీగా పారేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు శిరీష, వర్క్ ఇన్‌స్పెక్టర్ కిష్టప్ప, నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పూర్వ విద్యార్థులతో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ తేజ్‌లోహిత్‌రెడ్డి

రాయదుర్గం: రాయదుర్గంలోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్ క్యాంపస్‌లో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ పూర్వ విద్యార్థులు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.తేజ్‌లోహిత్‌రెడ్డి, ఫ్యాకల్టీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఉన్నత విద్యాసంస్థకు పూర్వ విద్యార్థులు ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థులు చదువు తర్వాత శక్తివంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. డిజైన్, రిటైల్, మేనేజిమెంట్, ఫుట్‌వేర్ టెక్నాలజీ, ఫ్యాషన్ వంటి రంగాల్లో రాణిస్తున్న పూర్వ విద్యార్థులు తమ మూలాలను గుర్తుంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను అందరితో పంచుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

చందానగర్: పుట్టినబిడ్డకి తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ ఆదిత్యనగర్ సెక్టార్ సూపర్‌వైజర్ కోమలి అన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్ సెక్టార్ మార్తాండనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలను శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం అన్నారు. పుట్టిన గంటలోపే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలన్నారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలే మొట్టమొదటి టీకా అన్నారు. ఆరు నెలల వరకు తల్లిపాలు తప్పకుండా ఇవ్వాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చే పౌష్టికాహారాన్ని తల్లులు, గర్భిణులు, బాలింతలు వినియోగించాలన్నారు. అనంతరం కాలనీలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త నాగశ్రీలత, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.


మార్తాండనగర్‌లో ర్యాలీలో కోమలి, అంగన్‌వాడీ సభ్యులు

ముగిసిన డ్రేపర్ ఫౌండర్స్ ప్రోగ్రాం

గచ్చిబౌలి: దేశంలో మొదటిసారిగా 12రోజుల డ్రేపర్ ఫౌండర్స్ ప్రోగ్రాం విజయవంతంగా ముగిసింది. ఫిన్నోస్ ఏఐ వ్యవస్థాపకుడు రుషికేష్ చవాన్, జాల్ట్స్ వ్యవస్థాపకుడు శుభం శర్మ డ్రేపర్ హీరోస్‌గా ఎంపికయ్యారు. వారిద్దరు అమెరికాలోని డ్రేపర్ యూనివర్సిటీలో శిక్షణకు 15వేల డాలర్ల స్కాలర్‌షిప్ గెలుచుకున్నారు.గచ్చిబౌలిలో నిర్వహించిన తొలి డ్రేపర్ ఫౌండర్స్ ప్రోగ్రామ్ నివాస ప్రాతిపదికన యాక్సిలిరేటర్ ప్రోగ్రామ్ ముగింపులో దేశవ్యాప్తంగా ఉన్న 14స్టార్టప్‌లకు చెందిన 16వ్యవస్థాపకులు తమ స్టార్టప్‌లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న టై గ్లోబల్ బోర్డు ఆఫ్ ట్రస్టీస్ చైర్ మురళి బుక్కపట్నం మాట్లాడుతూ డ్రేపర్ స్టార్టప్ హౌస్ అసాధారణమైన ప్రతిభ కనుగొందన్నారు. ప్రతి వ్యవస్థాపకుడు ఒక గొప్ప భవిష్యత్తు అంచున నిలుచున్నాడని ప్రశంసించారు. రత్నాకర్ విక్రాంత్‌వర్షిని, అనీష్ ఆంథోని, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.


టై గ్లోబల్ బోర్డు ఆఫ్ ట్రస్టీస్ చైర్ మురళి బుక్కపట్నంకు జ్ఞాపిక అందిస్తున్న నిర్వాహకులు

శేరిలింగంపల్లి బి.స్మార్ట్ ఎస్‌ఎల్‌ఎంపీఎస్ అధ్యక్షుడిగా నిజామ్‌అలీఖాన్

రాయదుర్గం: శేరిలింగంపల్లి మండలంలోని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లతో కూడిన బీస్మార్ట్ ఎస్‌ఎల్‌ఎంపీఎస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ప్రకటించారు. రాయదుర్గంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ భరత్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. అసోసియేషన్‌కు నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. అంతేకాకుండా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా నిజామ్‌అలీఖాన్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, కోశాధికారిగా హిమబిందు, ముఖ్య సలహాదారుగా మారోజు ఆచార్య ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారిని అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో బిస్మార్ట్ రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి పాల్గొని ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి సమష్టిగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, కోశాధికారి మనేందర్, పలు పాఠశాలల కరస్పాండెంట్లు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న పాఠశాలల కరస్పాండెంట్లు

కళాశాలలో పెరుగుతున్న అడ్మిషన్లు

• మధురానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 20 వరకు అడ్మిషన్ల ప్రక్రియ

రాయదుర్గం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రోజురోజుకూ చేరికలు పెరుగుతున్నాయి. ఇప్పటి వరకు గచ్చిబౌలి డివిజన్ మధురానగర్‌లోని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 408 మంది విద్యార్థులు మొదటి సంవత్సరంలో చేరారు. కాగా ఇప్పటికే ద్వితీయ సంవత్సరంలో 364 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అంటే కళాశాలలో ఇప్పటివరకు మొత్తం విద్యార్థుల సంఖ్య 772 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రస్తుతం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులు నిర్వహిస్తుండగా కొత్తగా ఈ ఏడాది నుంచి హెచ్‌ఈసీ కోర్సును ప్రారంభించారు. కాగా కంప్యూటర్‌సైన్స్‌లో ఒకేషనల్ కోర్సును కూడా నిర్వహిస్తున్నారు. కళాశాలకు సొంత భవనం ఉండగా సౌకర్యాలు ఏటేటా మెరుగుపడుతున్నాయి.

20 వరకు చేరికలకు అవకాశం..

మధురానగర్‌లోని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరేందుకు ఈ నెల 20వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఇప్పటి వరకు 408 మంది మొదటి సంవత్సరంలో చేరారని గుర్తు చేశారు. మరింత మందికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని, అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అర్హులైన వారికి బస్‌పాస్, ఉపకారవేతనాలు అందిస్తామన్నారు.


మధురానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం